

ముకుందా.. మురారి!

అట్టహాసంగా మొదలైన కృష్ణాష్టమి వేడుకలు

బృందావనాన్ని తలపించిన ఇస్కాన్ మందిరం





హనుమద్ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న రాధాపార్థసారథులు



నృత్యం చేస్తున్న చిన్నారులు



కోలాటమాడుతున్న భక్తులు





చిన్నికృష్ణుడి సందడి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం చిన్నికృష్ణుడు, గోపికల వేషధారులైన చిన్నారులతో అనంత బృందావనాన్ని తలపించింది. జిల్లా వ్యాప్తంగా చాలాప్రాంతాల్లో వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి. గోపాలుడి స్మరణలో ఊరూవాడా మునిగిపోయింది. జిల్లాకేంద్రంలోని ఇస్కాన్ మందిరం రేపల్లెను తలపించింది. రాధాపార్థసారథులను దర్శించుకునేందుకు హాజరైన భక్తులతో ఇస్కాన్ పరిసరాలు సందడిగా మారాయి. ఈసందర్భంగా ఆలయంలో ఇస్కాన్ మేనేజర్ దామోదర్ గౌరంగదాస్ నేతృత్వంలో ఉదయం దర్శన హారతి, లోకశాంతికోసం గీతాయజ్ఞం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు ముచ్చటగొలిపే చిన్నికృష్ణులు, గోపికమ్మల వేషధారణలు, అల్లరిచేష్టలతో సందడి చేశారు. రాత్రికి రాధాపార్థసారధులకు హనుమద్ వాహనసేవ, అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

మళ్లీ మంచిరోజులు!

సూక్ష్మసేద్యానికి ప్రోత్సాహం దిశగా అడుగులు

- జిల్లాకు భారీగా టార్గెట్ విధించిన రాష్ట్ర ప్రభుత్వం
- 37,500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటు లక్ష్యం
- ఈనెల మొదటివారం నుంచి రిజిస్ట్రేషన్ ఆరంభం
- వైసీపీ పాలనలో కంపెనీలకు పేరుకుపోయిన బకాయిలు



అనంతపురం అర్బన్/ యాడికి, ఆగస్టు 25: వైసీపీ పాలనలో కుదేలైన సూక్ష్మ సేద్యానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా కోసం భారీ టార్గెట్‌ను ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూ రు చేయాలన్న లక్ష్యం విధించారు. ఇదే క్రమంలో రైతు సేవా కేంద్రాల్లో ఈనెల మొదటి వారం నుంచి రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే ఇప్పటి దాకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. మరో వైపు గత ప్రభుత్వ హయాంలో డ్రిప్ కంపెనీలకు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఆయా కంపెనీల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లేందుకు ముందడుగు వేయడం లేదని సమాచారం. డ్రిప్ కంపెనీల రాష్ట్ర ఉన్నతా ధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోందన్న అభిప్రాయాలున్నాయి.

జిల్లాకు భారీ టార్గెట్

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాను టార్గెట్‌గా విధించింది. గతంలో ఉమ్మడి జిల్లాకు అత్యధికంగా 23వేల హెక్టార్ల దాకా లక్ష్యం విధించినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటు న్నారు. ఇందులో కేవలం అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. ఇందుకు సంతోష పడాలో..? లేక కంపెనీల ప్రతినిధులు క్షేత్ర స్థాయికి వెళ్లపోవడంతో బాధపడాలో తోచని అయోమయంలో ఏపీ ఎంఐపీ యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కు ఆరు నెలల ముందు నుంచి డ్రిప్ మంజూరును కంపెనీలు ఆపేశాయి. పనులు లేకపోవడంతో డ్రిప్ కంపెనీల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ సిబ్బందిని తొలగించినట్లు సమాచారం. మరోవైపు పలు కంపెనీలకు డీలర్లు దూరమైనట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలు చెల్లిస్తేనే తిరిగి ఫీల్డ్ సిబ్బందిని నియమించుకోవడంతోపాటు డీలర్లను నియమించుకొని ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు పలు కంపెనీల ప్రతినిధుల నుంచి వినిపిస్తున్నాయి. బకాయిలు విడుదల చేయకపోతే డ్రిప్ మంజూరు ప్రక్రియ మరింత ఆలస్యం కావడం తథ్యమన్న వాదనలున్నాయి.

ఖరారుకాని సబ్సిడీ

జిల్లాకు ఈ సారి భారీగా డ్రిప్ పరికరాల మంజూరు లక్ష్యం విధించినప్పటికీ ఇంకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. గతంలో టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో సూక్ష్మ సేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచి తంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు. గత వైసీపీ పాలనలో సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు సంబంధించి మార్గదర్శకాలను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచిత సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. ఇతర కేటగిరిల రైతుల తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. ఎన్నికల హామీ మేరకు గతంలో టీడీపీ అమలు చేసిన పాత పద్ధతిలోనే డ్రిప్ పరికరాలు మంజూరు చేసేలా సబ్సిడీ ధరలు ఖరారు చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ.130 కోట్లకుపైగా బకాయిలు

గత వైసీపీ పాలనలో జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్లు సరఫరా చేసిన కంపెనీలకు దాదాపు రూ.130 కోట్లకుపైగా బకాయి ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో భారీగానే బకాయిలు పేరుకుపోయినట్లు తెలిసింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో కంపెనీలు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందుకొచ్చాయి. ఇటీవల కొంత బకాయి సొమ్ము విడుదల చేసినప్పటికీ ఇంకా ఎక్కువ శాతం డబ్బులు రావాల్సి ఉండటంతో డ్రిప్ కంపెనీల రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా స్థాయిలో కంపెనీ అధికారులకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఏపీఎంఐపీ అధికారుల ఒత్తిడులతో డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలం టూ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించడంతోనే కంపెనీల ప్రతినిధులు సరిపెట్టారు. ఆ తర్వాత క్షేత్ర స్థాయికి సిబ్బందిని పంపించి రిజిస్ట్రేషన్ తర్వాత చేయాల్సిన పనులు చేయడం లేదన్న విమర్శలున్నాయి.



ముందుకు సాగని రిజిస్ట్రేషన్ ప్రక్రియ

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 10137 మంది రైతులు 15820 హెక్టార్లల్లో డ్రిప్ పరికరాల కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరోవైపు గత ఏడాది రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ 17096 మంది రైతులకు 22923 హెక్టార్లల్లో డ్రిప్ పరికరాలు మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో గతేడాది రిజిస్ట్రేషన్ చేసుకొని పెండింగ్‌లోని రైతులను ఈ ఏడాది జాబితాలోకి తీసుకొని డ్రిప్ మంజూరు చేస్తామని ఏపీఎంఐపీ అధికారులు పేర్కొంటున్నారు. అయితే గతేడాది దరఖాస్తు చేసుకున్న రైతుల్లో ఎవరెవరు డ్రిప్ పరికరాలు తీసుకునేందుకు ప్రస్తుతం సిద్ధంగా ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు వెళితేనే అర్హుల జాబితా కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

త్వరగా ఇవ్వాలి



మూడెకరాల్లో కూరగాయల సాగు చేసేందుకు డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నా. గత వైసీపీ ప్రభుత్వంలో అనేక మంది డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. అందుకే గతంలో దరఖాస్తు చేసుకోలేదు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో డ్రిప్ కోసం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నా.

- రైతు పుల్లారెడ్డి, ఓబుళాపురం, యాడికి మండలం

వేగవంతం చేయాలి




సబ్సిడీ ధరలు ఖరారు చేసి డ్రిప్ మంజూరును వేగవంతం చేయాలి. కంపెనీల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో డ్రిప్ మంజూరుకు సంబంధించిన పనులు మొదలుపెట్టేలా చూడాలి. గతంలో టీడీపీ హయాంలో సూక్ష్మ సేద్యం పరికరాలకు వర్తింపజేసిన సబ్సిడీని కొనసాగించాలి. సీఎం చంద్రబాబునాయుడు రైతులకు ఇచ్చిన హామీ మేరకు 90 శాతం సబ్సిడీతో తిరిగి పరికరాలు సరఫరా చేసి, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగన్‌వాడీ టీచర్‌కు ఉపాధి బిల్లు

100 రోజులు పనులకు వెళ్లినట్లు రికార్డుల్లో నమోదు

రాప్తాడు, ఆగస్టు 24: మండలంలోని మరూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మాచిరెడ్డి మమత (జాబ్ కార్డు నెంబర్ 10173)ఉపాధి పనులు చేసి బిల్లులు డ్రా చేసినట్లు రికార్డుల్లో నమోదైంది. హౌసింగ్ పథకంలో ఉపాధి బిల్లులతోపాటు, చెరువులు, చెక్‌డ్యాంలో పూడిక తీత పనులు చేసినట్లు నమోదు చేశారు. దాదాపు 100 రోజులు ఉపాధి కూలి పనులు చేసినట్లు మస్టర్లు, ఎం బుక్కుల్లో నమోదు చేసి దాదాపు రూ.25 వేల బిల్లులు డ్రా చేశారు. ఈ తంతంగమంతా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగింది. మరూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మాచిరెడ్డి చెన్నారెడ్డి భార్య మమత పదేళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధి పనులకు వెళ్లకూడదు. అయితే దాదాపు 100 రోజులు హౌసింగ్ పథకం ద్వారా చెరువు, చెక్‌డ్యాంలో పూడికతీత పనులకు వెళ్లినట్లు ఉపాధి రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు డ్రా చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 2022-23, 2023-24 సంవత్సరాల్లో అంగన్‌వాడీ టీచర్ ఉపాధి పనులు చేసినట్లు నమోదు చేసి ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించారు. కాగా పేదలకు ఇచ్చే గృహాలను కూడా వైసీపీ నాయకుడు చెన్నారెడ్డి వదలలేదు. తన భార్య మాచిరెడ్డి మమత పేరు మీద ప్రభుత్వ గృహం మంజూరు చేయించుకుని దాదాపు రూ.కోటిన్నరతో డూప్లెక్స్ హౌస్ నిర్మించుకున్నాడు.



ఉపాధి పనులు చేసినట్లు నమోదు చేసిన బిల్లులు

మహిళలను లక్షాధికారులను చేయడానికే లఖ్‌పతి దీదీ

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25: స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా జీవనోపాధుల పెంపు కింద అక్కాచెల్లెమ్మలను లక్షాధికారులను చేయడమే లఖ్-పతి దీదీ పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మహారాష్ట్రలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న లఖ్-పతి దీదీ పథకం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణశర్మ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లాలో 887స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.80.56కోట్లు చెక్‌ను విడుదల చేశారు. ఎంపీ మాట్లాడుతూ వ్యవసాయం, భారీ, కుటీర పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధిలో మహిళలను భాగస్వాములు చేయడమే లఖ్-పతి దీదీ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 887 స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ.80.56కోట్లు బ్యాంకు రుణాలు అందజేశామని తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎఫ్) ద్వారా లఖ్-పతి దీదీలకు ఆర్థిక సహాయం అందజేసి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పండ్లతోటల పెంపకం, పశుసంవర్థకశాఖ, వ్యవసా య, రైతు సాధికార సంస్థ, నాబార్డు, పరిశ్రమల శాఖ, రూడ్‌సెట్‌లను సమన్వయం చేసుకుని మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబుళమ్మ, డీఆర్‌డీఏ-వెలుగు ఏపీడీ ఈశ్వరయ్య, పీఎం రాధారాణి, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



స్వయం సహాయక మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్

అక్రమ పింఛన్లు 35 వేలు



డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయం

ఇప్పటి వరకూ వెయ్యి మందికే నోటీసులు

జిల్లావ్యాప్తంగా అధికారులకు ఫిర్యాదులు

నకిలీ సదరం సర్టిఫికెట్ల గుట్టు రట్టయ్యేనా..?

అనంతపురం క్లాక్‌టవర్: అధికారమే అండగా వైసీపీ నాయకులు, వలంటీర్లు ఏమి చేసినా జరిగింది. వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్ల ద్వారా సామాజిక భద్రతా పింఛన్ పొందారు. జిల్లాలో ఇలాంటివి 35 వేలకు పైగా ఉన్నాయని అధికారుల అంచనా. వీరిలో ఇప్పటి వరకూ కేవలం వెయ్యి మందికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్నవారు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఇతర సర్టిఫికెట్లను ఎంపీడీఓలకు అందజేయాల్సి ఉంటుంది. అర్హత లేకున్నా పింఛన్ పొందుతున్న వారిని జాబితా నుంచి తొలగించాలని జిల్లా వ్యాప్తంగా అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. యాడికి మండలంలో 87 ఫిర్యాదులు, పెద్దపప్పూరు 89, కూడేరు 321, పెద్దవడుగూరు 184, రాప్తాడు 314, ఆత్మకూరు 45, కుందుర్పి 72, ఉరవకొండ 86, అనంతపురం రూరల్ 99, వజ్రకరూరు 64, కంబదూరు 124 మందిపై ఫిర్యాదులు ఇప్పటి వరకూ వచ్చాయి. ఫిర్యాదు అందనివి వేలల్లో ఉన్నాయి. అక్రమ పింఛన్లను అరికడితే ప్రభుత్వానికి రూ.కోట్లలో సొమ్ము ఆదా అవుతుంది. ప్రజా ధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

రాప్తాడులో వలంటీర్.. భర్తకు పింఛన్

ప్రభుత్వం నుంచి పారితోషికం తీసుకునే వారు పింఛన్లకు అనర్హులు. రాప్తాడులో ఏకంగా గ్రామ వలంటీరు, ఆమె భర్త పింఛన్ పొందుతున్నారు. రాప్తాడు మండలంలో వలంటీర్ సుగాలి లక్ష్మీదేవి, ఆమె భర్త దాసరి శబరికి వైకల్యం లేదు. అయినా వైసీపీ ప్రభుత్వం అండతో ఆయన పేరిట సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నారు. ఐడీ నంబరు 11200155753, ద్వారా పింఛన్ పొందుతున్నారు. అదే రాప్తాడులో వలంటీరు మారుతమ్మ భర్త శివ పింఛన్‌కు అనర్హుడు. వైకల్యం లేకపోయిన సదరం సర్టిఫికెట్‌తో ఐడీ నంబరు 1200099942తో పింఛన్ తీసుకుంటున్నాడు. రాప్తాడులోనే వలంటీర్ గణేష్ తల్లి ఆదినారాయణమ్మ ఐడీ నంబరు 1121128048 ద్వారా పింఛన్ పొందుతున్నారు. అదే ప్రాంతంలో వలంటీరు చాకలి లక్ష్మీదేవి తల్లి నాగలక్ష్మి అక్రమంగా పింఛన్ పొందుతున్నారు. మరో వలంటీరు తన తల్లిపేరిట పింఛన్ పొందుతున్నారు. కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి సరస్వతి వలంటీరుగా పనిచేస్తూనే ఐడీ నంబరు 12500031123 కింద పింఛన్ తీసుకుంటోంది. తన భర్త బండి రవి పేరిట సదరం సర్టిఫికెట్ తెప్పించి పింఛన్ మంజూరు చేయించింది. బండి రవి పింఛన్ ఐడీ నంబరు 12500015878. ఇవి మచ్చుకు మాత్రమే. క్షేత్రస్థాయిలో అధికారులు విచారిస్తే.. వేలల్లో బయట పడతాయి.



బండి రవి



నోటీసులు జారీ చేశాం..



మాకు వచ్చిన ఫిర్యాదులు, అనుమానం వచ్చిన పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశాం. ఎంపీడీఓల ద్వారా నోటీసులు అందుకున్నవారు వెంటనే సమాధానం ఇవ్వాలి. వారి సమాధానం, సర్టిఫికెట్ల ఆధారంగా పింఛన్ వెరిఫికేషన్ చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పరిశీలన చేయాలని భావిస్తున్నాం. ఇదంతా ప్రభుత్వపాలసీకి సంబంధించిన అంశం. వలంటీర్లు పింఛన్ పొందకూడదు. నకిలీ సదరం సర్టిఫికెట్లు ద్వారా పింఛన్లు పొందడం నేరం. మెడికల్ బోర్డు ద్వారా సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోంది.

- ఓబులమ్మ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ

దొరవారి దర్శనం.. దుర్లభం

- సమస్యలపై వెళ్లే అర్చకులను కలవనీయని వైనం
- దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ తీరుపై అసహనం



డిప్యూటీ కమిషనర్ సమావేశంలో ఖాళీగా కుర్చీలు (ఫైల్)


అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: గుడిలో దేవుడి దర్శనమైనా దొరుకుతుందేమో కానీ ఆ గుడుల నిర్వహణను చూసుకునే అధికారి దర్శనం మాత్రం చాలా కష్టంగా మారిందని అర్చక వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3115 ఆలయాలు దేవదాయశాఖ పరిధిలో ఉన్నాయి. ఆలయాల్లో నిత్యం దైవారాధనలో నిమగ్నమయ్యే తమ పట్ల ఆ ఉన్నతాధికారి తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు అర్చకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి రోజూ అర్చకులు తమ వారసత్వ అర్చకత్వం హక్కు, ఆలయాల్లో పూజలు చేసేందుకు డీడీఎన్ఎస్ అమలు, ధార్మిక పరిషత్ ద్వారా వేతనాలు, మాన్యం భూముల సమస్యలు, ఆలయాల అభివృద్ధి, వేడుకల నిర్వహణ వంటి రకరకాల సమస్యలపై సహాయ కమిషనర్ కార్యాలయానికి వస్తుంటారు. వారు తనను నేరుగా కలవకుండా సమస్యలపై తెచ్చిన వినతిపత్రాలను కింది స్థాయి సిబ్బందికి ఇచ్చేసి వెళ్లిపోవాలని ఆ అధికారి.. సిబ్బందికి హుకుం జారీ చేశారు. ఈ ఉన్నతాధికారి అనంతపురం జిల్లాకు బదిలీపై వచ్చినప్పటి నుంచి అధికారిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయట్లేదు. కనీసం మీడియాకు కూడా సమాచారం తెలపడం లేదు. గతనెల 30వ తేదీన జిల్లా కేంద్రంలోని మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో దేవదాయ శాఖ ఉపకమిషనర్ గురుప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశ విషయం ఆ శాఖలోని సగం సిబ్బందికి తెలియజేయకపోవడం గమనార్హం. దీంతో సమావేశానికి అరకొరగానే హాజరయ్యారు.

ఇదేం తీరు..?



సమస్యలు తెలిపేందుకు వెళ్లే అర్చక పురోహితులను బయటే పెట్టడం తగదు. వినతిపత్రాలిచ్చేందుకు వెళ్తే కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బందికి ఇచ్చేసి వెళ్లమంటున్నారు. ఇలా అయితే మా సమస్యలను నేరుగా ఎలా తెలపగలం..? వాటికి పరిష్కారం దొరుకుతుందని ఎలా విశ్వసించగలం..? గతంలో ఈ స్థానంలో పనిచేసిన ఉన్నతాధికారులెవరూ ఇలా వ్యవహరించలేదు. ప్రస్తుతమున్న అధికారి వారందరికీ భిన్నంగా వ్యవహరించడం బాధాకరం.

- వైపీ ఆంజనేయస్వామి, ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు


ఖాళీగా ఉన్న స్టాల్స్

ఖాళీ బజార్

● నిరుపయోగంగా రైతు బజార్ స్టాల్స్ ● కూరగాయలన్నీ పాతూరు మార్కెట్‌కే.. ● అవగాహన కల్పించని అధికారులు

అనంతపురం రూరల్, ఆగస్టు 25: రైతులు పండించిన కూరగాయలను వారే అమ్ముకునేందుకు వీలుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. పేరుకు మాత్రమే ఉంది తప్ప.. ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. రైతుబజార్ ఏర్పాటై ఏళ్లు గడుస్తోంది. ఇప్పటికీ రైతులు, వినియోగదారులు పెద్దగా రావడంలేదు. దీంతో వెలవెలబోతోంది. ఎప్పుడో టమోటా.. ఎర్రగడ్డల ధరలు ఎక్కువగా ఉన్న సమయంలో మాత్రం జనం అటువైపు వస్తారే తప్ప.. మిగిలిన సమయాల్లో కన్నెత్తి కూడా చూడరు. కూరగాయల కోసం పాతూరు మార్కెట్‌కు వెళుతుంటారు. అందరికీ అందుబాటులో ఈ రైతు బజార్ ఉంది. అన్ని రకాల స్టాల్స్ ఉన్నాయి. వాటిని రైతులు సద్వినియోగం చేసుకునేదిశగా సంబంధిత యంత్రాంగం అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. దీంతో సగానికి పైగా స్టాల్స్ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు రైతుబజార్ ఉందనే విషయాన్నే మరచిపోయారు. ఏదో సందర్భంలో తప్పితే.. మళ్లీ అటు వెళ్లిన దాఖలాలు లేవు.


రైతుబజార్ ముఖద్వారం

సగానికిపైగా స్టాల్స్ ఖాళీ..

రైతుబజార్‌లో 31స్టాల్స్ ఉన్నాయి. దుకాణాలు 20 ఉన్నాయి. షాపుల్లో మూడు మినహా అన్నింటిలోను వ్యాపారాలు సాగుతున్నాయి. స్టాల్స్ పరిస్థితి దయనీయంగా ఉంది. 31లో పదింటిలో కూరగాయల వ్యాపారం సాగుతోంది. మిగిలిన వన్నీ ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి సంబంధిత అధికారులు చుట్టుపక్కల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి.. తమ ఉత్పత్తులను రైతు బజారుకు తీసుకొచ్చి విక్రయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా ప్రయత్నాలు చేయని పరిస్థితులు కనిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు బాగానే ఉంటున్నాయి. రైతులకు లాభం అంతంతే అన్న వాదనలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొంత అవగాహన కల్పించి రైతులే రైతుబజారులో విక్రయించుకునేలా చేస్తే ఇటూ రైతులకు.. అటు వినియోగదారులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఆ దిశగా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.


నిరుపయోగంగా ధరల డిస్‌ప్లే బోర్డు

పనిచేయని ధరల డిస్ ప్లే బోర్డు..

రైతుబజారులో కూరగాయల ధరలు జనానికి తెలియజేయడానికి గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.5లక్షల వ్యయంతో ఎలక్ట్రిక్ డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. ఇంత వరకు అది పనిచేసింది లేదు. రాష్ట్రంలోని అన్ని రైతు బజార్లలో ఈబోర్డుల ఏర్పాటు కాంట్రాక్టు ఒక్కరే దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడే వాటిని వదిలేసినట్లు తెలుస్తోంది. దీనికితోడు రైతు బజార్‌లో వర్షపు నీరు ఇతరాత్రా నీరు బయటకు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కాలువ పూర్తిగా దెబ్బతింది. దాని గురించి పట్టించుకునేవారు లేరు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

ప్రతాప్‌రుద్రం: రైతుబజారు ఎస్టేట్ అధికారి

ఏటా గ్రామాల్లోకి వెళ్లి రైతులకు తమ ఉత్పత్తులను రైతు బజారులో విక్రయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు ఉచిత స్టాల్స్‌నూ కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.





ఉద్యోగుల్లో ఉత్కంఠ


పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం

● నేడు పీఆర్ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ● సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా..? ● విభాగాల మార్పు జరిగేనా..?

అనంతపురం సిటీ, ఆగస్టు25 : పంచాయతీ రాజ్ ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో పీఆర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం జరగనుంది. ఈ బదిలీలకు రాయలసీమ జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖలో వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులందరూ హాజరుకానున్నారు. ఈ ప్రక్రియ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ అధ్యక్షతన జరగనుంది. ఆయితే కౌన్సెలింగ్ ప్రక్రియపై పీఆర్ ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది రేపుతోంది. ఎవరు, ఎక్కడికి బదిలీ అవుతారోనని ఆయా వర్గాల్లో చర్చగా మారింది.

● గత వైసీపీ ప్రభుత్వంలో జోరుగా పైరవీలు..

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టడంతో ఆయా ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా మందికి బదిలీల్లో అన్యాయం జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎక్కువ శాతం పైరవీలు చేసి కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పోస్టింగ్‌లు పొందినట్లు సమాచారం. ఈ సారి నిబంధనల ప్రకారం ఆయా ఉద్యోగులు బదిలీలకు సిద్ధమయ్యారు. నాలుగు జిల్లాల బదిలీలు అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగుతుండటంతో మరింత ఆసక్తి నెలకొంది. గతంలో మాదిరిగా కాకుండా నేటి కౌన్సెలింగ్ ప్రక్రియలో అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ఉద్యోగులు భావిస్తున్నారు.

రాయలసీమ జోన్‌లో బదిలీల కౌన్సెలింగ్ వివరాలు

డీఈఈ	: 40
ఏఈ,ఏఈఈలు	: 128
టెక్నికల్ ఆఫీసర్స్	: 4
ఏటీఓలు	: 2
జేటీఓలు	: 13
సూపరింటెండెంట్‌లు	: 1
సీనియర్ అసిస్టెంట్‌లు	: 3
ఆఫీస్ సబార్డినేట్‌లు	: 4

● సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా..?

బదిలీల కౌన్సెలింగ్‌లో సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా లేదా అన్న చర్చ ఆశాఖ వర్గాల్లో జోరుగా సాగుతోంది. డీఈఈ స్థాయి ఉద్యోగాలు ఎక్కువగా ఖాళీ ఉండటంతో ఆ పోస్టులపై తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఆ పోస్టుల కోసం ఎవరిస్థాయిలో వారు ప్రయాత్నాలు మొదలు పెట్టారు. ఎక్కువ ఖాళీలు ఉండడం, రెగ్యులర్ డీఈఈలు తక్కువగా ఉండటంతో ఏఈ, ఏఈఈలకు ఎఫ్ఏసీ పేరుతో డీఈఈ పోస్టులు అప్పగించడం ఆనవాయితీ. ఇదిలా ఉండగా.. కింది స్థాయి ఉద్యోగులు ఎఫ్ఏసీ కింద డీఈఈలుగా పోవడంతో ఏఈఈ, ఏఈ స్థానాలు చాలా వరకు ఖాళీగా ఉండడం.. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలు లేకపోలేదు.

విభాగాల మార్పు జరిగేనా..?

పంచాయతీ రాజ్‌శాఖలో పీఆర్ఐ, పీఐయూ, క్యూసీ విభాగాల్లో ఏళ్ల తరబడి ఉద్యోగులు అదే శాఖలోనే ఉండిపోయారు. వేరే విభాగాలకు మాత్రం బదిలీ కావడం లేదు. ఉదాహరణకు. పీఆర్ఐలో పనిచేస్తున్న వారు అదే పీఆర్ఐలోని మరో డివిజన్‌కు బదిలీ అవుతున్నారే కానీ.. క్యూసీ, పీఐయూ విభాగాలకు బదిలీ కావడం లేదు. అదే తరహాలోనే పీఐయూ, క్యూసీ విభాగాల్లోనే అదే ప్రక్రియ ఉందని తెలుస్తోంది. వీటికితోడు నిత్యం ఆఫీస్ విభాగాల్లో పనిచేసే వారు కూడా అదే ఆఫీస్ విభాగాలకు బదిలీ అవుతున్నారు కానీ.. పీల్డ్‌కు బదిలీ కావడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ప్రధానంగా నిబంధనలు ప్రకారం.. ఐదేళ్లు దాటిన వారిని మాత్రమే బదిలీ చేయాలన్న నిబంధన ఉంది. కాకపోతే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పేరుతో.. రెండు, లేదా మూడేళ్లు పనిచేసిన వారిని కూడా బదిలీ చేస్తారా..? అనే సందేహాలు నెలకొన్నాయి. ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని ఆయా ఉద్యోగులు కోరుతున్నారు.

● అధిక ఖాళీలతో ఎఫ్ఏసీ ప్రక్రియ...

పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పరిధిలోని డీఈఈ, ఏఈ, ఏఈఈ తదితర విభాగాల్లో అధిక శాతం రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ప్రభుత్వాలు ఎఫ్ఏసీ ప్రక్రియ అమలు చేస్తున్నారు. ఆయితే ఈ క్రమంలో చాలా వరకు రెగ్యులర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపణలు లేకపోలేదు. ఈ బదిలీల్లో అందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర నాయకులు

వ్యవసాయ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

● జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



అనంతపురం అర్బన్, ఆగస్టు 25: ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక రైతు బజార్ సమీపంలోని కృషి భవన్‌లో ఆ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర ప్రసాద్ ఎంపికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేశులు, రాజగోపాల్, రంగస్వామి, కార్యదర్శిగా బాలాజీనాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నరసింహులు, సల్మా, సహాయ కార్యదర్శులుగా ప్రభాకర్, వీరేష్‌బాబు, హపీజ్, పద్మావతి, కోశాధికారిగా ప్రాణేష్‌రావు, ఈసీ సభ్యుడిగా శ్రీనివాసులు, స్టేట్ కౌన్సిలర్‌గా పుల్లయ్యలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.

జీడిపల్లికి 1076 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 25 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం 1,076 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.265 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

నేటి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం క్రైం,ఆగస్టు 25 : ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం, పీజీఆర్ఎస్)కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. 26వతేదీన శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా వేదికను రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సెప్టెంబరు 2న నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షకు


దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచారకేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

బదిలీలకు దొడ్డిదారి టీం..!

● జడ్పీలో చక్కబెడుతున్న ప్రత్యేక బృందం ● ఉన్నతాధికారుల వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు



అనంతపురం విద్య, ఆగస్టు 25 : ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ పరిధిలో బదిలీల వేళ అనధికారికంగా ఓ బృందాన్ని రంగంలోకి దించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జడ్పీలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు ఉన్నా...ఇతర మండలాల నుంచి ప్రత్యేకంగా వారిని దించినట్లు సమాచారం. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కొందరిని సీట్లలో కూర్చోబెట్టి...బదిలీల వ్యవహారాలను చక్కబెట్టాలని నోటి మాటగా ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. జడ్పీ కార్యాలయంలో ఉన్న వారిని కాదని బయటి వ్యక్తులను తీసుకురావడం వెనుక....వ్యాపారం కోసమేనంటూ...ఉద్యోగులు, సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఉత్తర్వులు లేకుండా ఈ టీం ఎందుకంటూ...మండిపడుతున్నారు.

446 దరఖాస్తులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి సాధారణ బదిలీలకు ఉద్యోగుల నుంచి 446 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 286 మంది ఉన్నారు. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 15 మంది కాగా, సీనియర్ అసిస్టెంట్లు 25 మంది, జూనియర్ అసిస్టెంట్లు 43 మంది, టైపిస్టులు 18 మంది, డ్రైవర్లు ఇద్దరు, రికార్డు అసిస్టెంట్లు 70 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు 20 మంది లైబ్రరీ అసిస్టెంట్ ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ 89 మంది, నైట్ వాచ్‌మెన్స్ ముగ్గురు ఉన్నారు. ఐదేళ్ల పూర్తయిన వారు 286 మంది ఉండగా... వీరిలో ఇప్పటి వరకు బదిలీలకు 231 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. రిక్వెస్టు బదిలీలకు 215 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.

పాగాకు.. పావులు

ఉమ్మడి జిల్లా కేంద్రమైన జడ్పీ కార్యాలయంలో పాగా వేసేందుకు కొందరు అధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. సుమారు 15 ఏళ్ల రాప్తాడు, అనంతపురం ఎంపీడీఓ కార్యాలయాల్లో పనిచేసిన ఓ మహిళా అధికారి మళ్లీ జడ్పీలో పాగా వేయాలని చూస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గతంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసి జైలుకు వెళ్లిన మరో అధికారి సైతం ఇక్కడికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఎవరిస్థాయిలో వాళ్లు పైరవీలు మొదలు పెట్టారు. మరికొందరు ఎంపీలు, ఎమ్మెల్యేల లెటర్లతో జడ్పీకి క్యూ కడుతున్నారు. దీంతో సామాన్య ఉద్యోగులు తమ అవకాశాలను తన్నుకుపోతారోనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నాయకులపై దాడి

ఉరవకొండ,ఆగస్టు 25: వజ్రకరూరు మండలంలోని బోడిసానిపల్లి తండాలో టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో టీడీపీకి చెందిన భీమ్లానాయక్, శంకర్‌నాయక్, ప్రకాష్‌నాయక్, ఉమాబాయికి గాయాలయ్యాయి. పొట్టానాయక్ ఇంటి ముందున్న పూలమొక్కలను భీమ్లానాయక్‌కు చెందిన ఆవు తొక్కింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. వివాదం సద్దుమణిగింది. తమనే ప్రశ్నిస్తావా అంటూ పొట్టానాయక్ వర్గీయులు లక్ష్మానాయక్, రంగస్వామినాయక్, వాలునాయక్, స్వామినాయక్ మరికొంతమంది శనివారం రాత్రి భీమ్లానాయక్ కుటుంబసభ్యులపై కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో భీమ్లానాయక్ తలకు తీవ్రగాయమైంది. శంకర్‌నాయక్, ప్రకాష్‌నాయక్, ఉమాబాయి గాయపడ్డారు. బాధితులు వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులను మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు ఈశ్వర్, శర్మాస్ ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీకి మెజార్టీ వచ్చిందన్న అక్కసుతోనే వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని మండల కన్వీనర్ పేర్కొన్నారు.


గాయపడిన వారిని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

● ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు ● ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 5న తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగం మూడు డిస్కంలలో ఈపీడీఎల్ విశాఖపట్నం, సీపీడీసీఎల్ విజయవాడ, ఎస్పీడీసీఎల్ తిరుపతి పరిధిలో 23,500 కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పీస్‌రేట్ కార్మికులు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం హమాలీలు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ కార్మికులు 6వేల మంది వరకు పనిచేస్తున్నారని, ట్రాన్స్‌కో జెన్కో మూడు డిస్కంలలో 17,500 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ థర్డ్‌పార్టీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే కార్మికులను విలీనం చేసుకుని నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసిన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత కార్మికులకు ఇస్తున్న వేతనాలు వీరికి కూడా చెల్లించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేసి కాంట్రాక్టు కార్మికులందరినీ విలీనం చేసుకుని వేతనాలు, డీఏ, హెచ్ఆర్ఏ అమలు చేయాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్లలోనూ వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు అమలు చేయాలని, వాటిని అమలు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, వారి కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలన్నారు. ఆర్‌టీలు పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, రెవెన్యూ క్యాషియర్లకు ఎలాంటి ప్రభుత్వ సెలవులు మంజూరు చేయకుండా పనిఒత్తిడి వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశలో అడుగులు వేస్తోందని, అదాని, అంబాని వంటి కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. విద్యుత్ రంగం ఎంతో కీలకమైన వ్యవస్థ అని, ఈ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సెప్టెంబరు 5న తిరుపతిలో చేపట్టనున్న ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుతికుమార్, నాయకులు రామచంద్ర, మధు, మహబూబ్‌బాషా, ఎస్‌కేఎం బాషా, సెక్యూరిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాగభూషణరెడ్డి, గంగాధర్, ఖాజావలి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు

డ్రా చేశాడు.. డబ్బు తీసుకోలేదు..

● ఏటీఎంలో నగదు వదిలేసిన ఖాతాదారుడు

గుంతకల్లు, ఆగస్టు25: పట్టణంలో ఓ బ్యాంకు ఖాతాదారుడు ఏటీఎం మిషన్‌లో డబ్బును డ్రాచేసి, ఆ డబ్బును తీసుకోకుండా వెళ్లిపోయాడు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఏటీఎంలో ఓ వ్యక్తి రూ. 5,500 డ్రాచేసి, డబ్బును తీసుకోకుండానే వెళ్లిపోయారు. బయోలైన్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న జీ బషీర్ అహ్మద్ అనే వ్యక్తి ఉదయం ఎనిమిదిన్నర ప్రాంతంలో ఆదే ఏటీఎంలో డబ్బు డ్రా చేయడానికి వెళ్లాడు. తన కార్డు ద్వారా డబ్బును తీసుకుంటుండగా ఏటీఎం యంత్రంలో ఎవరో డ్రాచేసిన డబ్బు కనిపించింది. తీసి చూడగా రూ. 5,500 ఉన్నట్లు గుర్తించారు. నాలుగవ శనివారం బ్యాంకుకు సెలవు కావడంతో బ్యాంకు అధికారులను సంప్రదించలేకపోయినట్లు ఆయన తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా సెలవు దినాలు కావడంతో మంగళవారం బ్యాంకుకు వెళ్లి డబ్బును వదలి వెళ్లిన వ్యక్తి వివరాలు తెలుసుకుని వారికి అందజేస్తానని ఆయన తెలియజేశారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, ఆగస్టు 25: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 2850 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. ఇందులో కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

● రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

అనంతపురం అర్బన్, ఆగస్టు 25 : జిల్లాలో తాజాగా కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు,శాస్త్రవేత్త శిరీషలు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నల్లరేగడి భూముల్లో ఈనెలాఖరు దాకా కంది, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. ఎర్రనేలల్లో కంది, ఆముదం, జొన్న, సజ్జ, ఆలసంద, పెసర, కొర్ర తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. సెప్టెంబరు 1 నుంచి నెలాఖరు వరకు ఎర్రనేలల్లో జొన్న, సజ్జ, అలసంద, ఉలవలు, కొర్ర, పెసర తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నల్లరేగడి భూముల్లో పొద్దుతిరుగుడు, జొన్న, కొర్ర, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. రబీ సీజన్‌లో నల్లరేగడి పొలాల్లో పప్పుశనగ సాగు చేసే రైతులు ప్రస్తుతం పెసర, సజ్జ,ఉలవ, జొన్న, కొర్ర తదితర స్వల్ప కాలిక పంటలు సాగు చేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



ఎంపీ, ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎమ్మెల్యేతోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలకు అభినందన సభ నిర్వహించి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపులో ఆర్యవైశ్యులు ఎంతో కీలకపాత్ర పోషించారన్నారు. ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణంకోసం జిల్లాలోని ఆర్యవైశ్యులు స్థలం అడిగారని, వారి కోర్కెను ఖచ్చితంగా నెరవేరుస్తామన్నారు. టీడీపీ పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ కూచి హరి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు యువత నాయకుడు లింగారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కలవల రామ్‌కుమార్, అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, పాతూరు అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, కృష్ణం రఘు, తాటి మధు, టంగుటూరి నాగభూషణం, సత్రసాల మంజునాథ్, వంకదారు వెంకటకృష్ణ, భూమా బాల పాల్గొన్నారు.

రామకృష్ణుల విశ్వసేవా మందిరానికి సహకరిస్తాం: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో హెచ్చెల్సీ కాలనీలో నిర్మిస్తున్న రామకృష్ణుల విశ్వ సేవా మందిరానికి తనవంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆదివారం హెచ్చెల్సీ కాలనీలో నిర్వహించిన రామకృష్ణుల విశ్వ సేవా మందిరం శంకుస్థాపన కార్యాక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు శ్రీకృష్ణశశి, వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధరమూర్తి, వేణుగోపాల్, కార్యదర్శి వేదాద్రి ప్రవీణ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్వాన్ని నడిపిస్తున్నది శ్రీకృష్ణుడే: విశ్వాన్ని నడిపిస్తున్నది శ్రీకృష్ణుడేనని, ఆయన సూచించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడుద్దామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చెరువుకట్ట వద్ద ఉన్న బ్రహ్మకుమారీల కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పీటీసీ మైదానం అభివృద్ధికి కృషి

అనంతపురం అర్బన్: పీటీసీ మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. ఆదివారం నగర కమిషనర్ మూర్తి, పలువురు టీడీపీ నాయకులతో కలిసి పీటీసీలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. కొద్ది సేపు అక్కడి వారితో క్రికెట్ ఆడారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రాయల్ మురళీ, గంగారామ్, కూచి హరి పాల్గొన్నారు.

నయనానందకరం.. సాయి గోకులం..

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: సాయి ట్రస్టు, శ్రీ నృత్యకళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లలితకళాపరిషత్‌లో నిర్వహించిన సాయిగోకులం కార్యక్రమం వీక్షకులకు నేత్రానందం గావించింది. తొలుత గోకులకృష్ణుడికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలు గోపికమ్మ వేషధారణలతో కోలాటమాడగా... రాధాకృష్ణుల వేశాల్లో చిన్నారులచే సంప్రదాయ నృత్యప్రదర్శనలు నిర్వహించారు. ప్రదర్శనానంతరం చిన్నారులకు జ్ఞాపికల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, శ్రీనిధి రఘు, ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, యాంకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.







శ్రీకృష్ణుడు, గోపికల నృత్యాలు

29న తెలుగుభాషా దినోత్సవం

అనంతపురం విద్య, ఆగస్టు 25: తెలుగు భాషా దినోత్సవం-2024 29వ తేదీన పొట్టిశ్రీరాములు స్కూల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) జిల్లా గౌరవాధ్యక్షుడు ఎర్రిస్వామి, అధ్యక్షుడు హనుమేష్, ప్రధానకార్యదర్శి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల నేపథ్యంలో పాఠశాలస్థాయి విద్యార్థులకు వ్యాసరచన, సాహిత్య పరీక్షలు, చిత్రలేఖనం, పద్యధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన- తెలుగు భాష గొప్పతనం, గిడుగు రామమూర్తి చరిత్ర, సాహిత్య పరీక్ష-తెలుగువాచకాలలోని 50 బహుళైచ్ఛిక ప్రశ్నలు, చిత్రలేఖనం-తెలుగుతల్లి, నచ్చినకవి, పద్యధారణ-నచ్చిన ఏవైనా 5 పద్యాలు ఈ అంశాలపై 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్లుగా విభజించి పోటీలు నిర్వహించాలన్నారు.

చీరలషాపులో చెలరేగిన మంటలు

నార్పల, ఆగస్టు 25: మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జి వద్ద ఉన్న ట్రిపుల్ ఆర్ చీరల షాప్‌లో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. నార్పలకు చెందిన రేకులకుంట రామచంద్ర రెడ్డి చీరల షాపు రోజు లాగానే పనులు ముగించుకొని తాళాలు వేసి వెళ్లాడు. షాప్‌లో విద్యుత్ మీటర్ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి కరెంట్ ఆఫ్ చేయించి నీళ్లు చల్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు షాపు యజమాని తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నార్పల, ఆగస్టు 25: మండలంలోని కేశేపల్లి గ్రామం వద్ద ఆదివారం సీఐ కౌలుకుంట్లయ్య ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తుండగా తనిఖీలు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నార్పల, ఆగస్టు 25: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనంతపురం పట్టణానికి చెందిన రుషింగులు భార్య లక్ష్మీదేవి, వారి కుటుంబసభ్యులు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయంలో ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్రస్వామికి రూ.80వేలను వారు అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

అనంతపురం, సిటీ, ఆగస్టు 25: ఏపీ జేఏసీ హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గృహ నిర్మాణశాఖ పరిధిలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ ఆదివారం స్థానిక క్రిష్ణాకళామందిరంలోని రెవెన్యూ భవన్‌లో సమావేశమయ్యారు. జిల్లా కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ (ఏఈ), వర్కింగ్ ప్రసిడెంట్‌గా యుగంధర్ (వర్క్ఇన్‌స్పెక్టర్), ప్రధాన కార్యదర్శిగా చైతన్యరాజ్ (ఎంబిసీ), ట్రెజరర్‌గా రవిశంకర్‌నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హౌసింగ్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఎంటీఎస్ కింద ప్రభుత్వం పరగణించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పోరాడుతామని తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన వారికి ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



స్వామివారి బంగారు కవచంతో ప్రదక్షిణ చేస్తున్న పరిటాల సునీత

ఆత్మకూరు ఆగస్టు 25: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని ఆదివారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు. అలయ కమిటీ సభ్యులు, అధికారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వరుడికి అలంకరించే బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సునీత చేతులు మీదుగా ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అక్కిరెడ్డి ఎమ్మెల్యే పరిటాల సునీతకు మండల ఇన్‌చార్జి బాలాజీకి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, వేణుగోపాల్ రెడ్డి, బాలానాయక్ పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

అనంతపురం అర్బన్, ఆగస్టు 25: సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిపాలన సౌలభ్యం పేరుతో సచివాలయ ఉద్యోగులను ఇష్టారాజ్యంగా దూర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. అతి తక్కువ సమయంలో ఈనెల 24 నుంచి 27వతేదీ వరకు కేవలం నాలుగు రోజులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు. ఇందులో రెండు రోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నాయన్నారు. అంతర జిల్లాల బదిలీలు కూడా చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆన్‌లైన్‌లో ఆప్షన్ చూపించడం లేదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగికి తెలియకుండానే ఇతర మండలాల్లో పనిచేసే ఉద్యోగి సదరు స్థానానికి బదిలీ కావాలని దరఖాస్తు చేసుకొని రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తే... తప్పని పరిస్థితుల్లో బదిలీ కోసం ఆప్షన్ ఇవ్వకపోయినా పాత స్థానం నుంచి మరో ఉద్యోగి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సచివాలయ ఉద్యోగులు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సెరికల్చర్ రైతు సేవా కేంద్రం సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరికొన్ని రోజులు అవకాశం ఇవ్వాలన్నారు.

బాలికగా వెళ్లి... పెళ్లికుమార్తెగా..!

అనంతపురం క్రైం, ఆగస్టు 25: తెలిసీ తెలియని వయసులో బాలికలు తమ జీవితంలో సరిదిద్దుకోలేని తప్పులు చేస్తున్నారు. తల్లిదండ్రులను వదిలేసి మైనార్టీ తీరకుండానే ఆకర్షణనే ప్రేమనుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ఓ బాలిక పెళ్లికుమార్తెగా మారింది. ఇంట్లోకి సరుకులు తీసుకొస్తానని చెప్పిన బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసుల విచారణలో తాడిపత్రిలో ఓ యువకుడిని పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. అనంతపురం వన్‌టౌన్ పరిధిలో అదృశ్యమైన మరో బాలిక ఆచూకీ ఇంకా తెలియరాలేదు.

జీవనోపాధులను పెంపొందించడమే ధ్యేయం



డ్వాక్రామహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి పెంపొందించడమే ప్రభుత్వ ధ్యేయమని సత్యసాయిజిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు పేర్కొన్నారు. లఖ్-పతి దీదీ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన సందర్భంగా స్థానిక రుద్రమదేవి మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. దండు ఓబుళేశు మాట్లాడుతూ ఎస్ఎస్‌జీ మహిళల్లో కేవలం ఆదాయమే కాకుండా స్థిరమైన జీవనోపాధులు వ్యవసాయ, వ్యవసాయేతర వనరులను సమర్థవంతంగా నిర్వహించేందుకు, వారిలో శిక్షణా సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మండల వ్యాప్తంగా 3,080 మంది డ్వాక్రా మహిళా సభ్యులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఏపీఎం అనసూయమ్మ తెలిపారు. ప్రస్తుతం 220 మందిని గుర్తించామని, వారిలో 90 మందికి రుణాలను కూడా మంజూరు చేశామన్నారు. అనంతరం ఎంపికైన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. బీజేపీ రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి జిలకర ఆంజనేయులు, మండల సమాఖ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రాప్తాడు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం నల్లప్ప సూచించారు. పంగల్‌రోడ్డు సమీపంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన లక్‌పతి దీదీ కార్యక్రమ ఉద్దేశాన్ని లైవ్‌లో మండల సమాఖ్య లీడర్లకు వివరించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం మండల సమాఖ్య లీడర్లకు సర్టిఫికెట్లు అందచేశారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, రాప్తాడు సర్పంచ్ తిరుపాలు, బోగినేపల్లి సర్పంచ్ ఉజ్జినప్ప, వార్డు సభ్యుడు రాజు, మండల సమాఖ్య లీడర్లు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న వెలుగు ఏపీఎం నల్లప్ప

చెట్టుకు జీవం..!

● తొలగించిన వృక్షాన్ని మరోచోట నాటిన గ్రీన్ ఆర్మీ



నాటిన వృక్షం వద్ద గ్రీన్ ఆర్మీ వలంటీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25: ఒక చెట్టే కదా..! పోతే పోయిందిలే అని అనుకోకుండా దానికి మళ్లీ ప్రాణం పోయడానికి తపిస్తున్నారు. నగరంలోని గ్రీన్‌ఆర్మీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. ఈక్రమంలోనే నగరంలోని పాతూరులో విద్యుత్తు తీగలు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉన్న 40 ఏళ్ల వయస్సున్న మేడి చెట్టును కార్పొరేషన్ అధికారులు ఆదివారం తొలగించారు. ఈ సమాచారాన్ని నగరంలోని గ్రీన్‌ఆర్మీ స్వచ్ఛంద సంస్థ సిబ్బందికి అందించారు. దీంతో వారు వచ్చి ఆ వృక్షం కొమ్మలను కత్తిరించి మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా ట్రాక్టర్‌పైకి ఎక్కించి హెచ్చెల్సీ కాలనీకి తరలించారు. కాలనీలోని ఈఈ కార్యాలయం ఆవరణలో దాన్ని జాగ్రత్తగా మళ్లీ నాటారు. 56రోజుల్లో వృక్షం తిరిగి పెరగడం ప్రారంభిస్తుందని గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకులు ఏజీ అనీల్‌కుమార్ తెలిపారు. నగరంలో ఎక్కడ వృక్షాలు తొలగించినా తమ దృష్టికి తీసుకువస్తే మరో చోట ఆ వృక్షాన్ని నాటి బతికించే బాధ్యత తాము తీసుకుంటామని గ్రీన్‌ఆర్మీ సిబ్బంది తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి



చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు

అనంతపురం విద్య, ఆగస్టు 25: నగరంలోని శ్రీసత్యపబ్లిక్ స్కూల్‌లో క్రిష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా చేశారు. చిన్నారులు చిన్ని క్రిష్ణులు, గోపికల వేషధారణల్లో సందడి చేశారు. చిన్నికృష్ణులు ఉట్టి కొడుతూ...హంగామా చేశారు. స్కూల్‌లో ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. కరస్పాండెంట్ సత్యకళ, చిన్నారులు, టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ విజేత అనంతపురం

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 25: ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కానూరు 100 అడుగుల రోడ్డు అనుమోలు ప్రభాకర్ క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేతగా అనంతపురం నిలిచింది. కృష్ణాతో జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం జట్టు ఆదివారం 5-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించి ట్రోఫీని దక్కించుకుంది. అంతకుముందు తొలి సెమీస్‌లో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరగ్గా అనంతపురం 5-0తో గెలిచి ఫైనల్స్ చేరగా, రెండో సెమీస్ కృష్ణా-అన్నమయ్య జిల్లాల మధ్య జరగ్గా టై బ్రేకర్‌లో కృష్ణా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ క్రాంతికుమార్, ట్రెజరర్ విజయ్‌కుమార్‌లు హాజరై ట్రోఫీలు, మెడల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంవత్సరన్నరకాలంలో ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లను దిగ్విజయంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. 22 జిల్లాల నుంచి 460 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి, వివిధ జిల్లాల ప్రతినిధులు పి. ఆలీబాబా, పవన్, బుజ్జి, నీలాద్రి(కోనసీమ అధ్యక్షుడు), రిటైర్డు డీఎస్‌డీవో సుధాకర్, డీఎస్‌ఏ కోచ్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ మహిళలు, పురుషుల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25: బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ మహిళలు, పురుషుల జిల్లా జట్లు ఎంపిక చేశారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, కార్యదర్శి వెంకటేశులు ప్రకటించారు. మహిళల జట్టులో గంగోత్రి, వెంకటలక్ష్మి, విడపనకల్లు, సౌమ్య, శివకన్య, పద్మావతి, నిఖిల, వైష్ణవి, పూజ, హేమ, హరితలతో పాటు స్టాండ్‌బైలుగా అమృత, శ్రీలేఖ, బి అమృత ఎంపికయ్యారు. పురుషుల జట్టులో వెంకటేశులు, నారాయణస్వామి, మహబూబ్ బాషా, అశోక్, శ్రీనాథ్, సునీల్, అనీల్, బాలాజీ, గోవర్ధన్, పురుషోత్తం ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా ధనుంజయ, రవి, హరీష్, అశోక్ స్థానం సంపాదించారు. ఎంపికైన జట్లు నంద్యాలలో సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన కార్యవర్గం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25: మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో స్టేట్ మాఫీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎన్నికల పరిశీలకులు పాండురంగారెడ్డి, కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, అధ్యక్షుడుగా విశ్రాంత విద్యుత్ ఇంజనీర్ కె సుధాకర్‌బాబు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, కార్యదర్శిగా సికిందర్, కోశాధికారిగా అంకిరెడ్డి, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కార్యవర్గసభ్యులుగా శ్రీనివాసయాదవ్, రంగస్వామి, ఈశ్వర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'ఆకుల'కు తెలుగు వైభవం కవితా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆకుల రఘురామయ్య

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: జిల్లాకు చెందిన కవి ఆకుల రఘురామయ్యకు 'తెలుగు వైభవం కవితా పురస్కారం' వరించింది. ఎంపీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జాతీయస్థాయి శతాధిక తెలుగు కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురికి కవితా పురస్కారాలు అందజేశారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆకుల రఘురామయ్యకు తెలంగాణ శాసనమండలి సభ్యుడు చిన్నికృష్ణ, సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం చేతులమీదుగా తెలుగు వైభవం కవితా పురస్కారం అందజేసి సత్కరించారు.

యోగాను పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25: యోగాను పాఠ్యాంశంగా చేర్చడానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఓ హాల్‌లో జిల్లాస్థాయి యోగాసన ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ యోగా విద్యార్థి దశనుంచి అవగాహన, ప్రాధాన్యం కల్పించేలా పాఠ్యాంశంలో భాగం చేసి శారీరక, మానసికంగా పటిష్టమైన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కృషి చేస్తానని తెలిపారు. సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న యోగాసన సంఘం, వివేకానంద యోగా కేంద్రం సేవలు అభినందనీయమన్నారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 150మంది పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్, సభ్యులు మునిరాజు, వెంకట్, సుబ్బరాయుడు, దివాకర్, తారక రామయ్య, సుశీల, కృష్ణవేణి, కృష్ణ పాల్గొన్నారు.

'మోడల్' టీచర్లకూ కామన్ ప్రయోజనాలు

● ఎస్టీయూ రాష్ట్ర నాయకులు



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

అనంతపురం విద్య, ఆగస్టు 25: మోడల్ స్కూళ్లలో నియమితులైన ప్రిన్సిపాళ్లు, టీచర్లకు రెగ్యులర్ టీచర్ల సర్వీసు ప్రయోజనాలను అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఎస్టీయూ అనుబంధ సంస్థ ఏపీమోడల్ స్కూల్స్ ఎస్టీయూ(ఏపీఎంఎస్ఎస్టీయూ) జిల్లా కార్యవర్గసమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఏపీఎంఎస్ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూళ్లు స్థాపించి 12 ఏళ్లు అయినా.....మోడల్ స్కూళ్ల బోధనా సిబ్బందికి రెగ్యులర్ టీచర్ల ప్రయోజనాలు అమలు చేయడం లేదన్నారు. వెంటనే అమలు చేసి న్యాయం చేయాలన్నారు. పలు కారణాలతో మరణించిన 21 మంది టీచర్ల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఏపీఎం ఎస్ఎస్టీయూ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం: జిల్లా గౌరవాధ్యక్షులుగా సతీష్‌కుమార్, అధ్యక్షులుగా శ్రీరాములు, ప్రధానకార్యదర్శిగా తిమ్మయ్య, కోశాధికారిగా సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఓబుల్‌రెడ్డి, యాదమూర్తి, రమేష్‌కుమార్, ఐదుగురు ఉపాధ్యక్షులు, నలుగురు జాయింట్ సెక్రెటరీలుగా నియమించారు.

జాంబియా పర్యటనకు ప్రకృతి వ్యవసాయ బృందం



ప్రకృతి వ్యవసాయ బృందం సభ్యులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 25: జిల్లా ప్రకృతి వ్యవసాయ బృందం సభ్యులు జాంబియా దేశ పర్యటనకు వెళ్లారు. ఆదివారం నగరంలోని ప్రకృతి వ్యవసాయం కార్యాలయం నుంచి రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్, చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మానాయక్, లైజనింగ్ ఆఫీసర్ షేక్ ఇర్ఫాన్, చాంపియన్ రైతులు రవిచంద్ర, శివశంకర్, సుకన్య, సుధాకర్ జాంబియా దేశానికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి విమానంలో జాంబియా దేశానికి వెళ్లనున్నారు. సెప్టెంబరు 7వ తేదీ దాకా బృందం సభ్యులు ఆ దేశంలో పర్యటించనున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) మోడల్‌ను అక్కడి యంత్రాంగం, రైతులతో కలిసి ఆవిష్కరించనున్నారు. అక్కడి వ్యవసాయ ప్రతినిధులతో కలిసి ప్రకృతి వ్యవసాయంలోని ఆధునిక మోడల్స్‌ను ఏ విధంగా అమలు చేయాలన్న అంశంపై చర్చించనున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

● తాగునీటి కార్మికుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

గార్లదిన్నె, ఆగస్టు 25: సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని సత్యసాయి తాగునీటి కార్మికులు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 4వ రోజుకు చేరుకుంది. కల్లూరు పంపుహౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నామన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నాగభూషణం, బాషా, మల్లరాయుడు, సాంబశివ, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 25: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని పౌర చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం వేదిక ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రాఘవేంద్ర మాట్లాడుతూ సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రసారం చేస్తున్న అశ్లీలత, పోర్నోగ్రఫీ వెబ్‌సైట్లు, మద్యం, మాదకద్రవ్యాలు వంటివి మహిళలపై అత్యాచారాలకు కారణమవుతున్నాయన్నారు. వీటిని ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా, మానవతా రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, పౌర చైతన్యవేదిక నాయకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

శింగనమల ఆగస్టు 25: గ్రామాల్లో గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కలుట్లయ్య హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉండేందుకు సహకరించాలని, ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: శింగనమల-గార్లదిన్నె రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీఐ కౌలుట్లయ్య సీజ్ చేశారు. ఆదివారం పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని గార్లదిన్నె పోలీసులకు సీఐ అప్పగించారు.

ఇదేమి.. ఆస్పత్రి?

- పేరుకే 24 గంటల వైద్యసేవలు
- ఆదివారం అయితే వైద్యులు, సిబ్బంది అందరూ సెలవులోనే
- ఎమర్జెన్సీ అయితేనే చూస్తామంటున్న వైద్యులు
- తాడిపత్రి ఏరియా ఆస్పత్రి సిబ్బంది నిర్వాకంతో అవాక్కవుతున్న ప్రజలు



తాడిపత్రిలోని ప్రాంతీయ వైద్యశాల

తాడిపత్రి, ఆగస్టు 25: పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల పేరుకే వందపడకల ఆస్పత్రిగా ఉంది. గొప్ప భవనం, సకల సౌకర్యాలు, 24గంటల వైద్యసేవలు అంటూ వైద్యాధికారులు ఊకదంపుడు మాటలే తప్ప, చేతల్లో మాత్రం ఏమీ లేదు. ఈ విషయం నెలలో ఏ ఆదివారం ఆస్పత్రికి వెళ్లిన ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఆదివారం వస్తే చాలు ఆస్పత్రి సిబ్బంది అంతా ఏకకాలంలో సెలవుపై వెళుతున్నారు. ఒకే ఒక్క డాక్టర్ మాత్రం ఉంటూ ఎమర్జెన్సీ కేసులను మాత్రమే చూస్తారు. ఈ మాత్రం దానికి వందపడకల ఆస్పత్రి ఎందుకు తీసుకొచ్చారో, ఇంతమంది సిబ్బంది ఎందుకు ఉన్నారో, వారికి వేలాది రూపాయల జీతాలు ఎందుకో అర్థం కాని పరిస్థితి. తాడిపత్రి ప్రాంతం నంద్యాల, కర్నూలు, కడప జిల్లాలకు సరిహద్దుగా ఉంటోంది. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో నాపరాళ్లపరిశ్రమలు, గనులు, గ్రానైట్, సిమెంట్, స్టీల్ పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూ ఉంటుంది. పక్క జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఏం జరిగినా తాడిపత్రి ఏరియా ఆస్పత్రికే వస్తుంటారు. నిత్యం ఓపీ విభాగంలో 800నుంచి 1000మందిదాకా వస్తుంటారు. ఇక యాక్సిడెంట్ కేసులు చాలానే వస్తుంటాయి. అయితే వైద్యుల కోసం రోగుల బంధువులు వేచిచూడాల్సిన దుస్థితి ఇక్కడ నెలకొంది.

ఎమర్జెన్సీ అయితేనే చూస్తామంటున్న సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రిలో సరిగా వైద్యం అందించరు అన్న ప్రజల అపోహను ఇక్కడి వైద్యసిబ్బంది నిజమనేలా చేస్తున్నారు. సాధారణ రోజుల్లో వైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. ఇక ఆదివారం వస్తే చాలు ఆసుపత్రికి తాళాలు వేయడం, సెలవుపై వెళ్లడం పరిపాటిగా మారింది. సాధారణ ఓపీ విభాగపు సేవలు ఆదివారం ఉండవని, చాలా మంది ప్రజలకు తెలియదు. కానీ ఆదివారం వెళ్లిన ప్రతి ఒక్కరికి ఆసుపత్రి సిబ్బంది బయట నుంచే రోగికి ఏమైంది, సీరియస్ అయితే సార్ చూస్తారు , లేకపోతే రేపు రావాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. అక్షరజ్ఞానం లేని వ్యక్తులు బాధపడుతూ డబ్బు ఉంటే ప్రైవేట్ ఆసుపత్రికి లేకపోతే ఇంటికి వెళుతున్నారు. కొంచెం చదువుకున్న వ్యక్తులు ఆదివారం ఎందుకు సెలవు అని ప్రశ్నిస్తే డాక్టర్లు సెలవులో ఉన్నారు, ఆదివారం ఓపీ సేవలు పనిచేయవు, కేవలం ఎమర్జెన్సీ మాత్రమే చూస్తామంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో ఆసుపత్రికి కూడా సెలవులు ఉంటాయా అన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

జ్వరంతో వస్తే ఆదివారం చూడమంటున్నారు..



జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రి కి వస్తే ఆదివారం వైద్యసేవలు ఉండవని సిబ్బంది నిర్మొహమాటంగా చెబుతున్నారు. పైగా ఒక మా త్ర చేతిలో పెట్టి ఉదయాన్నే రావాలని ఉచిత సలహా ఇస్తున్నారు. కేవలం అత్యవసర కేసులను మా త్రమే సార్ చూస్తారని సిబ్బంది చెబుతుండడం ఆశ్చర్యకరంగా ఉంది.

\- గంగాధర్, యర్రగుంటపల్లి

ఆదివారం ఓపీ ఉండదు ..



ఓపీ సేవలు ఆదివారం ఉండవన్న మాట వాస్తవమే. కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే చూ స్తాం. ఆదివారం వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో ఈ పరిస్థితి ఉంది. ఆ రోజున ఓపీ విభాగ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నిస్తాం.

\- డేవిడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

దోమల బెడద తాళలేక ఇంటికెళ్తున్న రోగులు..

ఆస్పత్రిలో రాత్రి సమయంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రోగులు ఉన్న జ్వరం చాలక కొత్త రోగాలు వస్తాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో 10మందిలో 8మంది రాత్రి అయితే చాలు ఇంటికి వెళ్లి మళ్లీ ఉదయం వస్తామని చెప్పాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది కూడా వెళితే వెళ్లండి రాత్రి సమయంలో ఏమైనా జరిగితే మాకు సంబంధం లేదని, సంతకం పెట్టి వెళ్లాలని చేతులు దులుపుకుంటున్నారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు


సత్యసాయి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 25: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం ప్రత్యే క పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు బాబా విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏ కాదశ రుద్రాభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి చిత్రపటాన్ని అలంకరించి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి మందిరం వరకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ప్రపంచశాంతి కోసం లోకకల్యాణార్థం కోసం సత్యసేవా సంఘం రాష్ట్ర వేద అధ్యయనం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించినట్లు సత్యసాయి మండలి సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సత్యసాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పలు కాలనీల్లో పారిశుధ్య చర్యలు

- ప్రజల వినతి మేరకు స్పందించిన ఎమ్మెల్యే అమిలినేని
- తక్షణమే పనులు చేయాలని మున్సిపాలిటీ సిబ్బందికి ఆదేశం


చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కళ్యాణదుర్గం, ఆగస్టు 25: మున్సిపాలి టీ పరిధిలోని రాచప్పబావి వీధి, అనంతపురం రోడ్డు, సాయిబాబా ఆలయం తదితర ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొని ఉం ది. దీంతో తీవ్ర అసౌకర్యా నికి గురవుతున్న స్థానిక ప్రజలు ఆదివారం ఎమ్మె ల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ఫోన్ ద్వారా సమస్యను విన్నవించారు. తమ ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందని, డ్రైనేజీనీరు రోడ్లపై పారుతోందని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సి పాలిటీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి పారిశుధ్య చర్యలు చేపట్టారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కూడేరు, ఆగస్టు 25: మండలంలోని ఎంఎం హళ్లి గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. పరిస్థితిని తెలుసుకున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆ గ్రామానికి రూ. రెండు కోట్ల నిధులతో రోడ్డు మంజూరు చేయించారు. దీంతో ఆదివారం పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. పయ్యావుల సోదరుల కృషితో ఏళ్ల నాటి కల నెరవేరనుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజన్న, దేవేంద్ర, శ్రీనివాసులు, రామకృష్ణ, వన్నూరుస్వామి, రాంభూపాల్, రామస్వామి, అక్కులన్న, పోతులూరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 25: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి గాను అనంతపురం పట్టణానికి చెందిన నారాయణ స్వామి లక్ష రూపాయల విరాళం అందజేశారు. అందుకు సంబంధించిన నగదును ఆలయ అధికారులకు ఆదివారం అందించారు. అనంతరం దాత కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు, అర్చనచేయించారు. అర్చకులు ఆయనకు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

వీహెచ్‌పీ ఆత్మీయ సమ్మేళనం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 25: పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ రాష్ట్ర కో-కన్వీనర్ కసాపురం రవి మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ 1964 సంవత్సరం శ్రీకృష్ణజయంతి రోజున ప్రారంభమైందన్నారు. నేడు వందకు పైగా దేశాల్లో విస్తరించి లక్షలాది కార్యకర్తలతో 60 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు మాణిక్యం, విభాగ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, ధర్మప్రసార ప్రముఖ్ గద్వాల్‌ప్రతాప్, జిల్లా మహిళా మాతృశక్తి జయలక్ష్మి, పట్టణ మాతృశక్తి సంయోజక్ బింధు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం కావాలి

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 25 : విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వాల ధ్యేయం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబరు 19, 20 వ తేదీల్లో కళ్యాణదుర్గం పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కార్పొరేట్, ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తుండటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు దీనస్థితిలో ఉన్నాయన్నారు. వెంటనే వాటిని మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభలకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంత రాయుడు, మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెహమాన్‌కు అవార్డు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 25: అవుట్ స్టాడింగ్ బ్లడ్ డోనర్ అవార్డును పట్టణానికి చెందిన రెడ్‌డ్రాప్ యువజన సమితి వ్యవస్థాపకుడు రెహమాన్ అందుకున్నారు. సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా ఈనెల 22 తేదీన హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 42వ సారి రెహమాన్ రక్తదానం చేశారు. అలాగే ఇతర ప్రాంతాలలో కలిపి 131 సార్లు రక్తదానం చేసినందుకు ఆయన అవుట్ స్టాడింగ్ బ్లడ్ డోనర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందుకు గాను హైదరాబాదులో శిల్ప కళా వేదికలో 22వ తేదీ సాయంత్రం వాల్తేరు వీరయ్య, విశ్వంభర సినిమాల డైరెక్టర్లు బాబి, వశిష్ట చేతుల మీదుగా రెహమాన్ అవార్డు అందుకున్నారు.

చెట్నేపల్లిలో మసీదు ప్రారంభం

గుత్తి, ఆగస్టు 25: మున్సిపల్ పరిధిలో చెట్నేపల్లిలో దాదాల సహకారంలో నూతనంగా నిర్మించిన ఖాద్రీ మసీదును ఆదివారం ముస్లిం మత పెద్దలు ఘనంగా ప్రారంభించారు. ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీతో పాటు పలువురు మతపెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు.

డీఎస్సీ కోచింగ్‌ను వినియోగించుకోండి

- అభ్యర్థులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచన
- 74 ఉడేగోళంలో ఉచిత కోచింగ్ కేంద్రం ప్రారంభం


కోచింగ్‌లో పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులతో ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంటౌన్, ఆగస్టు 25: డీఎస్సీ అభ్యర్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో గల టెక్స్‌టైల్స్ పార్కులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ ఉన్నా.. ఉద్యోగాలు పొందలేక సతమతమవుతున్న వాళ్లకు సదావకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు. కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. గతంలో కూడా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రూప్స్‌కి కోచింగ్ ఇప్పించానని గుర్తు చేశారు. ఇక్కడి అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాలన్న ఉద్దేశంతో నిష్ణాతులైన ట్రైనర్ల చేత కోచింగ్ ఇప్పించనున్నట్లు చెప్పారు. కోచింగ్‌కు నియోజకవర్గవ్యాప్తంగా పెద్దఎత్తున అభ్యర్థులు తరలివచ్చారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ ఆర్డీవో రాణి సుస్మిత, తెలుగు అధ్యాపకులు హరీష్‌చారి, కార్మిక శాఖ అధికారి సత్యనారాయణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీతో ఆర్థిక స్వావలంబన

యాడికి, ఆగస్టు25: పీఎం నరేంద్రమోదీ ఆదివారం జలగావ్‌లో లాంచింగ్ చేసిన లక్‌పతి దీదీ పథకంతోనే మహిళల ఆర్థిక స్వావలంబన సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తెలిపారు. లక్‌పతి దీదీ పథకం ప్రారంభోత్సవాన్ని లైవ్ టెలికాస్ట్‌ను డ్వాక్రా మహిళలు వీక్షించేందుకు ఏర్పాట్లను మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రుద్రమనాయుడు హాజరైన మాట్లాడారు. ఈ పథకంతో మహిళలు వడ్డీలేని రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధించవచ్చునని తెలిపారు. అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులకు లక్‌పతి దీదీ పథకం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నిట్టూరు సర్పంచు ఈశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, తెలుగుయువత నాయకుడు నరసింహచౌదరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం(శెట్టూరు): శెట్టూరు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో లక్‌పత్ దీదీ పథకంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సర్దానప్ప ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎలా ఎదగాలి. జీవనోపాధిని ఎలా అభివృద్ధి చేసుకోవాలనే విషయంపై క్షుణ్ణంగా వివరించారు. సీసీ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

హత్యకేసు నిందితులను అరెస్టు చేయాలి

తాడిపత్రి, ఆగస్టు25: రాజేంద్ర హత్యకేసు నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ ఆదివారం ప్రకటనలో డిమాండ్‌చేశారు. పట్టణంలోని జయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న రాజేంద్ర కుటుంబ సభ్యులు అప్పుగా తీసుకున్న రూ.11వేలను 10 రూపాయల వడ్డీతో చెల్లించే విషయంలో ఆలస్యం చేస్తున్నారనే కోపంతో ఇదే కాలనీకి చెందిన తిప్పారెడ్డి, అయన భార్య నాగలక్ష్మితోపాటు కుటుంబసభ్యులు కులం పేరుతో దూషిస్తూ కట్టెలు, రాడ్లతో కొట్టి చంపారన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

హత్యకు గురైన రాజేంద్ర కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా కింద ప్రభుత్వం రూ.20లక్షలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పుల్లయ్య, పెద్దిరాజు, శివుడు, రాజారత్నం తదితరులు ప్రకటనలో డిమాండ్‌చేశారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు ఐదెకరాల భూమిని కేటాయించి ఆదుకోవాలని కోరారు.

వ్యక్తిపై కత్తితో దాడి

తాడిపత్రి, ఆగస్టు 25: పట్టణంలోని నంద్యాలరోడ్డులో శనివారం రాత్రి రంగనాయకులు అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి గాయపరిచారని పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని పాతకోటకు చెందిన రంగనాయకులు తన మిత్రుడు సాయిపై కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేస్తుండగా అడ్డుకోబోయాడు. దీంతో వారు రంగనాయకులుపై కత్తితో దాడిచేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేమకల్లులో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేకఅలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఆగస్టు 25 : శ్రావణమాసం సందర్భంగా మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు బ్రహ్మోత్సవాల పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, గంగపూజ, గోపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, పంచగవ్యమేళనం, ప్రధాన కలశ స్థాపన మండప ఆరాధన జరిపారు. తర్వాత స్వామివారికి వెన్నతో అలంకరణచేసి అష్టోత్తర సహస్రనామాలు పఠించి, నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. మంత్రపుష్పం జరిగిన అనంతరం ప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో నరసింహారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ తిప్పేస్వామి, టీడీపీ నాయకుడు గాలి బసప్ప, మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కూడేరు, ఆగస్టు 25: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 1991-1992 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 32 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే చొరవతో తాత్కాలిక రోడ్డు పూర్తి

- అనుంపల్లి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం


అనుంపల్లికి తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు

కళ్యాణదుర్గం (శెట్టూరు), ఆగస్టు 25: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అక్కడక్కడ రోడ్లు ధ్వంసమైన విషయం విదితమే. ఈ క్రమంలో శెట్టూరు మండలంలోనిఙ అనుంపల్లి గ్రామంలో రోడ్డుపై కల్వర్టు కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం క్రితం ఎ మ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గ్రామానికి ఘటనాస్థలిని పరిశీలించి, ప్రజ ల ఇబ్బందులను గమనించారు. వెంటనే కల్వర్టు పక్కన తాత్కాలిక రోడ్డు వేసి ప్రజల రాకపోకల కు మార్గం సుగమం చేయాలని అధికారులకు, స్థానిక టీడీపీ నాయకులకు సూ చించారు. ఆయన ఆదేశాల మేరకు చేపట్టిన తాత్కాలిక రహదారి నిర్మాణ పను లు ఆదివారానికి పూర్తయ్యాయి. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

సదస్సుకు తరలిరండి

కూడేరు, ఆగస్టు 25: రాష్ట్రవ్యాప్తంగా గత వైసీపీ పాలనలో ఎందరో భూములను కోల్పోయారని, అలాగే చాలామంది అర్హులైన పేదలకు భూ పట్టాల పంపిణీ విషయంలో అన్యాయం జరిగిందని, వారి సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీన విజయవాడలో సదస్సు జరగనుందని, కార్యక్రమానికి బాధితులందరూ తరలిరావాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆదివారం పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు మల్లికార్జున, పెరుగు సంగప్ప, రమణ, రమణప్ప, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూబాధితుల అవగాహన సదస్సు పోస్టర్లను సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ విడుదల చేశారు. ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిప్పేస్వామి, నరసింహులు, గురుస్వామి, దుర్గన్న సీపీఐ నాయకులు తిప్పేరుద్ర, హనుమంతు పాల్గొన్నారు.

భక్త కనకదాస విగ్రహాల ఏర్పాటుకు కృషి

కుందుర్పి, ఆగస్టు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల కురుబ సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుబలు అత్యధిక శాతంగా ఉన్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రతిపాదన కురుబలకు అత్యధిక స్థానాలు కేటాయించాలని కోరారు. కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని, ఆ రోజును సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. అనంతరం కుందుర్పి లో కనకదాస కళ్యాణ మండపం నిర్మించుటకు, పలు గ్రామాల్లో కనకదాస విగ్రహాల ఏర్పాటుకు, కనకదాస జయంతిని అన్ని చోట్ల ఘనంగా నిర్వహించేందుకు తీర్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు రామక్కపల్లి నాగరాజు, కురుగౌడ, నాగరాజు, కరేగౌడ, రామకృష్ణ, మల్లికార్జున, విటల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుత్తి, ఆగస్టు 25: పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన యువకుడు సోమశేఖర్(32) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్ ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అన్నా నేను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలంటూ ఓ హోటల్ యజమానికి రాసినట్లుగా మృతుడి వద్ద లెటర్ దొరిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

ఉరవకొండ/ రాయదుర్గం రూరల్ , ఆగస్టు 25: వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆపివేయాలని సీపీఐ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పటి బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి మల్లికార్జున కూడా ఈ మేరకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి, ఆగస్టు 25: పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పామిడికి చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వ్యక్తిగత పని నిమిత్తం కారులో పత్తికొండకు వెళ్లి తిరిగి వస్తున్నారు. పట్టణంలో ఆర్ఎస్‌కు వెళ్లే దారిలో కేంద్రీయ విద్యాలయం సమీపంలోకి రాగానే కారు ప్రమాదవశాత్తు డీవైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రజాపురం సమీపంలో యువకుడికి..

గుత్తిరూరల్, ఆగస్టు 25: మండలంలోని రజాపురం గ్రామ శివారులో గల 67వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా తుగ్గిలి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆనంద్ ద్విచక్ర వాహనంలో గుంతకల్లు మండలం వైటీ చెరువుకు బయలుదేరాడు. రజాపురం గ్రామశివారులోకి రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యాడికిలో ఒకరికి..

యాడికి, ఆగస్టు 25: మండలకేంద్రంలో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక వెంగమనాయుడు కాలనీకి చెందిన సురేంద్ర ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో బస్టాండ్‌కు బయలుదేరాడు. మసీదు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఆ సమయంలోనే వెనుక వస్తున్న బస్సు తగలడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు.